# తర్లపాడుకు మహర్దశ

- మారిన గ్రామం రూపురేఖలు
- అద్దంలా సీసీ రోడ్ల నిర్మాణం
- పరిశుభ్రత పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆనందంలో గ్రామస్తులు



తర్లపాడులో నిర్మించిన సీసీ రోడ్డు

ఖానాపూర్, అక్టోబర్ 8 : ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామ పంచాయతీకి మహర్దశ వచ్చింది. ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామంలో సకల వసతులు మిషన్ భగీరథ పథకంతో గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తొలిగిపోయాయి. సీసీ రోడ్ల నిర్మాణంతో వీధులన్నీ పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంలో భాగంగా మొక్కలు నాటడంతో పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సిగ్రిగేషన్ షెడ్డు, పల్లె పకృతి వనం, క్రీడా ప్రాంగాణం, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో 980 మంది జనాభా ఉండగా 667 ఓటర్లు ఉన్నారు. ఇందులో 306 మంది పురుషులు కాగా 667 మంది మహిళలు ఉన్నారు.



తర్లపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం

**గ్రామంలో చేపటిన అభివృద్ధి, సంక్షేమం**

- రూ. 35 వేలతో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు
- రూ. 20 లక్షలతో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు
- గృహలక్ష్మి పథకానికి 118 దరఖాస్తులు చేసుకోగా 80 మంది అర్హులుగా గుర్తింపు
- రూ. 12.60 లక్షలతో వైకుంఠధామం నిర్మాణం
- రూ. 1.80 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు ఏర్పాటు
- రూ. 80 వేలతో పల్లె ప్రకృతి వనం
- రూ. 10 లక్షలతో జీపీ ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్
- రూ. 6 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం
- రూ. 9.60 లక్షలతో 80 మందికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం
- 26 మందికి కల్యాణ లక్ష్మి పథకంతో 26 మందికి 26,03,016 చెల్లింపు
- 389 మందికి ఆసరా పింఛన్లు
- రైతు బంధు పథకం ద్వారా 338 లబ్ధి, 9 మంది రైతు బీమా పొందారు.

### సమస్యల పరిష్కారానికి కృషి..



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నాం. గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తున్నాం. పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధపెట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వం గ్రామ ప్రజలకు కావల్సిన మౌళిక వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నది. ప్రజల సహకారంతో గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాం. ఆదర్శ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

\- పెద్ది గోదావరి, సర్పంచ్(తర్లపాడు)

### మౌళిక వసతులు కల్పిస్తున్నాం..



గ్రామంలో ప్రజలకు కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ప్రభుత్వ అదేశాల మేరకు పారిశుధ్య పనులను నిత్యం చేపడుతున్నాం. వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా.

\- రిజ్వానా, పంచాయతీ కార్యదర్శి(తర్లపాడు)



పెద్దబెల్లాల్‌లో చీరెలను అందిస్తున్న సర్పంచ్ రమాదేవి

# ఆడబిడ్డల కోసం బతుకమ్మ చీరెలు

కడెం, అక్టోబర్ 8 : ప్రభుత్వం ఆడబిడ్డలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఇంటింటా చీరెలు పంపిణీ చేస్తున్నదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు పేర్కొన్నారు. ఆదివారం పెద్దబెల్లాల్, చిన్నబెల్లాల్, అంబారిపేట, నవాబుపేట గ్రామాల్లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు రమాదేవి, శ్రీకాంత్ యాదవ్, కొప్పుల లక్ష్మి, విజయ మాట్లాడారు. ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం చీరెలను పంపిణీ చేస్తున్నదని పేర్కొన్నారు. అనంతరం ఆయా పంచాయతీల్లో స్థానిక నాయకులతో కలిసి చీరెలను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



నర్సింగాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అలెగ్జాండర్

కడెం, అక్టోబర్ 8 : బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు ప్రగతి పథంలో దుసుకెళ్తున్నాయని కడెం ఎంపీపీ అంథోని అలెగ్జాండర్ పేర్కొన్నారు. ఆదివారం చిన్నబెల్లాల్ పరిధిలోని నర్సింగాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి చుట్టు కంపౌండ్‌వాల్ నిర్మాణం, గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ సౌదాని శ్రీకాంత్‌యాదవ్, ఎంపీటీసీ సుద్దాల లక్ష్మి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్ను మల్లేశ్‌యాదవ్, సుద్దాల జగన్, నాయకులు కందుల సునీల్, పంచతి శ్రీనివాస్, ఎల్తపు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

# ఆయకట్టుకు సాఫీగా నీరందేలా..



క్యాలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

దస్తురాబాద్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని కడెం ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటర్-3 కాల్వలో ఉన్న పిచ్చి మొక్కలను ఆదివారం భూత్కూర్ రైతులు తొలగించారు. డిస్ట్రిబ్యూటర్-3 కాల్వ కింద రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కాగా కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు పెరగడం ద్వారా భూత్కూర్ గ్రామ శివారులోని పంటలకు నీరు అందడం లేదు. దాదాపు 50 మందికి పైగా మంది రైతులు మండల కేంద్రం నుంచి భూత్కూర్ గ్రామం వరకు దాదాపు 3 కిలో మీటర్లు వరకు కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు, సిల్ట్‌ను తొలగించారు.

## ఆర్థిక సాయం అందజేత

ఖానాపూర్, అక్టోబర్ 8 : ఇటీవల గణేశ్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్‌షాక్‌కు గురైన ముగ్గురు యువకులకు ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం రూ. 10 వేల సాయం అందించారు. సుభాష్ నగర్ కాలనీలో బాధితులను పరామర్శించారు. నవీన్, శంకర్, జూని, ప్రవీన్, రవీందర్, పరి మల్, నరేశ్, సాయి పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న మిత్రులు

# మండల ఓటర్లు @ 12,637

- తుది జాబితా విడుదల
- పెరిగిన ఓటర్లు



గొడిసెర్యాలలో డిజిటల్ ఓటరు కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ జాకీర్

దస్తురాబాద్, అక్టోబర్ 8 : రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 4 వ తేదీన బుధవారం తుది ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులు చేసిన తర్వాత తప్పులు లేని ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించారు. మండలంలో మొత్తం 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 12,637 మంది ఓటర్లుండగా, ఇందులో 6173 మంది పురుషులు, 6464 మంది స్త్రీలు ఉన్నారు. అత్యధికంగా దస్తురాబాద్‌లో 1984, అత్యల్పంగా 253 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో పురుషలు ఓటర్ల కంటే 291 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. కాగా విడుదల చేసి తుది ఓటరు జాబితాను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంచారు. ఫారం -6, 7, 8 కింద వచ్చిన వాటన్నింటినీ ఏ రోజుకు ఆ రోజు అధికారులు, బీఎల్వోలు పరిష్కరించారు. జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ పక్కాగా నిర్వహించారు. చూసుకోని తొలగించారు. కచ్చితమైన రికార్డులు ఉంచుకున్న తర్వాతే తీసివేశారు.

**పెరిగిన ఓటర్లు..**

గత నవంబర్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించింది. ముసాయిదా ఓటరు జాబితాలో మండల ఓటర్లు 12002 మంది ఉన్నారు. అందులో పురుషులు 5860, స్త్రీలు 6142 మంది ఉన్నారు. మళ్లీ ఆగస్టులో విడుదల చేసి నతొలి ముసాయిదా ఓటరు జాబితాలో మండల ఓటర్లు 12406 మంది ఉండగా ఇందులో పురుషులు 6091, స్త్రీలు 6315 మంది ఉన్నారు. ఈ నెల 4 తేదీన తేదిన తుది ఓటరు జాబితా విడుదల చేయగా మండల ఓటర్లు 12,637 మంది ఉన్నారు. ఇందులో 6173 మంది పురుషులు, 6464 మంది స్త్రీలు ఉన్నారు. తొలి ముసాయిదా ఓటరు జాబితా కంటే తుది ఓటరు జాబితాలో 231 మంది ఓటర్లు పెరిగారు.

**జాబితాను అందుబాటులో ఉంచాం..**



విడుదల చేసిన ఓటరు జాబితాను ప్రభుత్వ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ఓటర్లు జాబితాను చెక్ చేసుకోవాలి. తప్పులు లేని ఓటరు జాబితా కోసం ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాం. పురుషుల ఓటర్ల కంటే 291 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

\- ఎండీ జాకీర్, తహసీల్దార్